క్లాసులో కూర్చుందన్న మాటేగాని, తన మనసు మనసులో లేదు. నిర్మలా టీచరు పాఠం చెప్తూకు పోతూంది. మిగతా విద్యార్థినులంతా బుద్ధిమంతుల్లా శ్రద్ధగా వింటున్నారు. తనకు మాత్రం పాఠం రవంత కూడా అర్థం కావటం లేదు. తన ఆలోచనలన్నీ నాన్న గురించే, నాన్న అమ్మని ఏం భాధపెడుతున్నాడో!-

"పారిశ్రామిక విప్లవం ఎపుడు వచ్చింది?" హఠాత్తుగా ప్రశ్నించింది నిర్మలా టీచరు తనను. ఎవరన్నా పరధ్యానంగా ఉన్నట్లనిపిస్తే వారిని ప్రశ్న అడగటం ఆమెకు అలవాటు. ఈమెకేగాదు, సహజంగా టీచర్లందరకూ సహజమేనేమో!

ఈ హఠాత్పరిణామానికి తను కలవరపడి పోయింది. నోటికి వచ్చిన జవాబు చెప్పింది. అంతే క్లాసులో వాళ్ళంతా గొల్లున నవ్వారు.

"సైలెన్స్...సైలెన్స్..."అంది టీచరు.

క్లాసంతా నిశ్శబ్దం.

సిగ్గనిపించింది. ఎపుడూ జవాబులు చెప్పటంలో చాలా చురుకుగా వుండే తను, ఈ రోజు పరధ్యానంగా వుండటంవల్ల తప్పు సమాధానం చెప్పింది. తెలీదు అని సమాధాన మిచ్చినా పోయేది. తనకే చిన్నతనమని పించింది.

"సారీ, టీచర్! తల నొప్పిగా వుంది. యింటికి వెడతాను..." అంది లేచి నుల్చుంటూ తను.

"వెళ్ళమ్మా!" పర్మిషన్ యిచ్చింది టీచరు.

బాగా చదువుతుందని క్లాసులో తనకి మంచి పేరుంది. మంచి మార్కులు వస్తాయని నిర్మలా టీచరుకు తనంటే ఎక్కువ అభిమానం.

పుస్తకాలు తీసుకుని క్లాసులోంచి బయట పడింది తను.

స్కూలు గేటు దాటి రోడ్డుమీదకి వచ్చే సరికి "రిక్షా ఎక్కుతారా, అమ్మా!" అని రోడ్డువెంట పోతున్న రిక్షావాడు అడిగాడు.

అవసరం లేదన్నట్లు తల అడ్డంగా తిప్పి, పుస్తకాలు ఎడమచేత్తో గుండెలకు ఆనించుకుని రోడ్డు వారగా నడుస్తూంది. నడుస్తున్నదన్న మాటే గానీ, ఆలోచనలన్నీ మళ్ళీ నాన్నమీదకే మళ్ళాయి.

నాన్నది ఓ రకమైన వింత మనస్తత్వం. తను నమ్మిన వాటినన్నింటినీ ఎదుటివారు కూడా నమ్మి తీరాలంటాడు. ఆయనకు జ్యోతిష్యం మీద ఎవరకూ లేనంత గట్టి నమ్మకం వుంది. ఆ జ్యోతిషమే, దాని మీద నాన్నకు వున్న విపరీతమైన నమ్మకమే తమ యింట్లో నిన్నటి నుంచీ అశాంతిని రేపింది. అనుక్షణం అమ్మ కన్నీటి జల్లుకు కారణమయింది. నాన్న హృదయంలో సంచలనాన్ని కలిగించింది. తన మనసు మనసులో లేకుండా చేసింది.

నిన్న ఉదయం తమ వీధి చివర పెంకుటింట్లో వుంటున్న అవధాన్లుగారు తమ యింటికి వచ్చారు. వాళ్ళ యింటికి ఎవరో సిద్ధాంతిగారు వచ్చారట. భగవద్గీత చదువుకుంటున్న నాన్నతో- "రావోయ్, రామ్మూర్తీ! చెయ్యి చూపించుకుందువు గాని... జాతకం కాగితం కూడా వుంటే పట్రా, మరీ మంచిది" అని చెప్పారు అవధాన్లుగారు. ఇంకేముంది-నాన్న ఎగిరి గంతేసి, పుస్తకాల పెట్టెలో అడుగున ఉన్న తన జాతకం కాగితం తీసుకుని అవధాన్లుగారితో కల్సి వారింటికి వెళ్ళారు.

గంట తర్వాత యింటికి తిరిగి వచ్చిన నాన్న ముఖంలో విచారం ద్యోతక మవుతోంది.

"ఏమిటండీ! అలా వున్నారు!"-అడిగింది అమ్మ.

"కాముడూ!- నీకో విషయం చెబుతాను- నమ్ముతావా?" అడిగాడు నాన్న.

"చెప్పండి!"

"అలాగంటే కుదరదు- నమ్మితీరాలి".

"సరే" అంది అమ్మ.

ఇంకేముంది- ఈ విషయం చెప్పాడు నాన్న. అసలు ఈ వార్త చెబుతాడని తను అనుకోలేదు. అమ్మ వూహించనే లేదు. ఎవరు మాత్రం వూహిస్తారు- యిలాంటి దుర్వార్తలను?- "ఇంకో పదిరోజుల్లో నేను చచ్చిపోతాను- కాముడూ?" నాన్న గొంతులో వైరాగ్యం ధ్వనిస్తూంది.

అవాక్కయిపోయింది అమ్మ. నమ్మలేనట్లుగా నాన్నవేపు చూసింది భయంగా.

"నిజం కాముడూ! నేను చెబుతున్నది నూటికి నూరుపాళ్ళా నిజం. ఆ సిద్ధాంతి ఎంతో గొప్పవాడు. ఆయనకు మంచి పేరుంది. జ్యోతి శ్శాస్త్రమంతా ఔపోసనపట్టినవాడు. నా జాతకం, చెయ్యీ చూసి చెప్పారు". ఇంకో పదిరోజుల్లో ఈ లోకంతో ఋణం తీరిపోతుంది. ......" యింకా ఏవేవో చెప్తూకు పోతున్నాడు నాన్న వేదాంత ధోరణిలో.

"చాలు, యిక ఆపండి... మీరు నూరేళ్ళూ బ్రతుకుతారు" అమ్మ కళ్ళల్లో భయంతాలూకు ఛాయలు స్పష్టంగా గోచరిస్తున్నాయి.


"నా మీద ఉన్న ప్రేమ వల్ల నువ్వట్లా అంటున్నావు- కాముడు! నిజం నాకు తెల్సు, పిచ్చిదానా! ఈ భూమ్మీద నాకు నూకలు చెల్లాయి. వెళ్ళిపోతాను. యిపుడు ఈ సిద్ధాంతి చెప్పటమే కాదు. ఇరవై ఏళ్ళ క్రితం ఓ బైరాగి చూసి చెప్పాడు- అరవయ్యో ఏడు దాటే సరికి నాకు ఋణానుబంధం తీరిపోతుందని, సరిగ్గా పది రోజుల్లో అరవై దాటుతాయి నాకు. నిజం, కాముడూ!- యిది నిజం"

నాన్న మాటలు యిక వినలేక అమ్మ పెరట్లోకి వెళ్ళిపోయింది. అమ్మ కళ్ళనిండా కన్నీటి సుడులు. అమ్మ ఎంత బాధ పడిపోయిందో నాన్న మాటలు వింటూంటే! గుండె తరుక్కుపోయి వుంటుంది. అవును- ఏ భార్యకు మాత్రం బాధగా వుండదు తన భర్త మరొక పది రోజుల్లో తనని శాశ్వతంగా వదిలి వెళ్ళిపోతున్నాడంటే. తను నమ్మనీ, నమ్మకపోనీ అసలా తలంపే ఎంత కఠోరంగా వుంటుంది? ఎంత భయంకరంగా వుంటుంది?

సాధారణంగా లక్షరూపాయలు లాటరీలో వస్తాయని జ్యోతిష్యంలో చెబితే నమ్ముతాడు. ఆకస్మికంగా బంధువుల ఆస్తికలుస్తుందని చెప్పినా నమ్ముతాడు. జీవితంలో నాలుగు పెళ్ళిళ్లు జరుగుతాయని చెప్పినా సులభంగా నమ్మేస్తాడు. కానీ, త్వరలోనే చావబోతున్నావని ఏ సిద్ధాంతి చెప్పినా, ఎంతగా జ్యోతిష్యం మీద నమ్మకం వున్న మనిషయినా నమ్మడు. 'జ్యోతిష్యం'లో అంతా జరగదు కొంతే జరుగుతుందని అనేస్తాడు.

కాని, నాన్న అందరిలాటి మనిషి కాదు. జ్యోతిష్యాన్ని పూర్తిగా నమ్ముతాడు. తన జీవితం యిప్పటి వరకూ జాతక ఫలాన్ననుసరించే నడిచిందని ఆయన చాలాసార్లు అన్నాడు కూడా. అందుకే నాన్నకి తను మరో పది రోజుల్లో చచ్చిపోతున్నాడంటే అంత గట్టి నమ్మకం.

ఆ నమ్మకంతోనే తను పోయిన తర్వాత తన తోడు లేని అమ్మ బ్రతుకును వూహించుకుని "కాముడూ! యిన్ని రోజులూ కష్టసుఖాల్లో కలిసి బ్రతికాం. యిపుడు నేను పోతే నువు బ్రతక గలవా?" అని అమ్మని వెంటపడి మరీ అడుగుతూంటె, అమ్మ ఏమని చెప్పగలదు? వర్షించే కనులతో దీనంగా చూడటం తప్పితే!"



ఆ దీనమైన చూపును అర్థం చేసుకోరు నాన్న. ఆ చూపు వెనక వున్న అమ్మ భయాన్ని గ్రహించడు. 'మీరు లేకుండా. నేను బ్రతకలేనండీ' అన్న అమ్మ చూపులోని భేలత్వాన్ని పరిశీలించనూలేడు.

పాపం! నాన్న గొడవ నాన్నది. ఆయన ఆలోచనలు ఆయనవి. తన ఆలోచనలన్నీ అమ్మతో చెబుతూంటే, ఆ స్త్రీ హృదయం ఎంతవరకూ తట్టుకోగలదు?

అమ్మ కనుల ముందు మెదిలింది.

నాన్న మళ్ళీ తన చావు కబుర్లు చెప్పి అమ్మ మనసును ఎంత బాధ పెడుతున్నాడో!

ఆలోచనల్లోంచి తేరుకుని ఇంట్లోకి అడుగు పెట్టింది. నాన్న అపుడే బజార్నుంచి వచ్చాడేమో చొక్కా విప్పి దండెంమీద వేస్తున్నాడు.

అమ్మ వంటింటి వాకిలి ఎదురుగా కూర్చుని వంకాయలు తరుగుతూంది.

పన్నెండు గంటలు కాకముందే కాలేజినుంచి వచ్చిన తనని చూసి, 'అప్పుడే వచ్చావేమిటమ్మా!'' అనడిగింది అమ్మ.

''తలనొప్పిగా వుంటేనూ...'' పుస్తకాలు టేబుల్ మీద పెట్టి, అమ్మ దగ్గరకు వస్తూ చెప్పింది.

''నేను ముక్కలు తరుగుతాను, నువ్వింకో పని చూసుకోమ్మా!'' అంది తను కత్తి పీట దగ్గరకు లాక్కుంటూ.

''వద్దమ్మా! నేను తరుక్కుంటాను. తలనొప్పిగా వుందన్నావుగా. అలమార్లో అమృతాంజనం వుంది. కణతలకు రాసుకుని పడుకో'' అంది అమ్మ.

అమ్మకి తనంటే ఎంత ప్రేమో! ఏపని చెయ్య బోయినా- ఎటూ తిరిగి రేపు వెళ్ళిన చోట చెయ్యాలిగా. ఇక్కడ కూడా ఎందుకులే?'' అంటుంది.

నిజంగా తలనొప్పిగా వుంటే కదూ తను అమృతాంజనం రాసుకుందుకు? గదిలోకెళ్ళి మంచం మీద పడుకుంది.

మళ్ళీ నాన్న అమ్మను పిలవటం వినిపించింది.

''కాముడూ!-''

''ఊఁ'' అంది అమ్మ.

నాన్న మళ్ళీ ఏదో మొదలెట్ట బోతున్నాడనుకుంది తను.

తను వూహించినంతా జరిగింది. ప్రస్తుతం నాన్న ఏది మాట్లాడినా తన చావు గురించే. తను పోయిన తర్వాత తమ భవిష్యత్తు గురించే.

''నేను పోయిన తర్వాత జుట్టు తీయించుకుంటావు గదూ!''

''మళ్ళీ అవాచకం మాటలు మొదలు పెట్టారా?''

''అవాచకం మాటలు కాదు, కాముడూ! నిజంగా అడుగుతున్నాను. జుట్టు తీయించుకుంటావు గదూ!

అమ్మ మాట్లాడలేదు.

''ఏడుస్తున్నావా, కాముడూ! ఎంత పిచ్చిదానివి- 'జాతస్యమరణం ధృవం'. ఏదో ఒక రోజు ఈ ప్రాణం అనంత వాయువుల్లో కలియక మానదు. ఏ రోజైతేనేం? కాకపోతే నేను ముందు, నువు తర్వాత. అంతే తేడా!''

''మీరిట్లా నన్ను వేధించుకు తింటూంటే ఇంకొక్క క్షణం కూడా నేను యింట్లో వుండను, మా అన్నయ్యగారింటికి వెళ్ళిపోతాను''- బాధగా అంటూంది అమ్మ. అమ్మ గొంతు వింటూంటే తనకూ బాధ అనిపించింది. తనకూ దుఃఖం ఆగలేదు. నాన్నకు ఏం భావ్యంగా వుంది, అమ్మను యిలా అనుక్షణం వేధించుకు తినడం?

''వెర్రి కాముడూ! నేను చచ్చి పోతానంటే ఎంత భయం నీకు? అవునులే, యిన్నాళ్ళా పట్టెడు పసుపు కుంకుమంతో మహాలక్ష్మిలా వెలుగుతున్న నీరూపు చావుతో చెంఘెం పోతుంది జుత్తు తీసేస్తారు. గాజులు వేసుకోటానిక్కి వీలులేదు. నాకే భయంకరంగా వుంది కాముడూ, నే పోయిన తర్వాత నీరూపు ఎట్లా వుంటుందో వూహించుకుంటే!''

'నాన్నా!' పెద్దగా అరుద్దామనిపించింది కాని, ఎందుకో అరవలేక పోయింది. నాన్నను మందలించేంతటి చనువు తనకు లేదు. ఏ రోజూ నాన్న తనను ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నట్టుగాని, తన ఒడిలో కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పినట్టు గాని తనకు గుర్తు లేదు. అంతమాత్రాన నాన్నకు తన మీద ప్రేమ లేదని కాదు. ఏమిటో నాన్న తత్వమే అంత.

నాన్న మాటలు వింటూంటే ఆ మాటలు వినలేక అమ్మ ఆత్మహత్య చేసుకుంటుందేమో ననిపించింది.

నాన్న మళ్ళీ ఏదో మాట్లాడబోతున్నాడు.

ఇంతలో శాస్త్రి మామయ్య వచ్చాడు. ఆయన తమకు బంధువు కాదు కానీ అంతకు మించిన ఆత్మీయుడు. నాన్నకు బాల్య మిత్రుడు. తమ కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటాడు. సహృదయుడు.

''రావోయ్, శాస్త్రీ! ఇలా కూర్చో!'' అన్నాడు నాన్న.

'కులాసాయేనా, అన్నయ్యగారూ!'' ఉభయ కుశలోపరి అడిగిందమ్మ.

''ఆ ... అందరూ క్షేమంగానే వున్నారమ్మా. అన్నట్టు మా రెండో వాడికి విజయవాడ సంబంధం ఖాయపర్చుకుని వచ్చాము. పిల్ల బంగారు బొమ్మ. కట్నం కోసం ఆశపడలేదు. చక్కని గాత్రం వుంది- అబ్బాయికి కూడా నచ్చింది. ముహూర్తాలు కూడా పెట్టుకున్నాం. వివాహం వచ్చే నెలలో నిర్ణయించాం!'' ఉత్సాహంగా చెబుతున్నాడు మామయ్య.

''నీ కొడుకు పెళ్ళి చూసే యోగం నాకు లేదోయ్, శాస్త్రీ!'' అన్నాడు వేదాంతిలా నాన్న.

''అదేం!'' వేదాంతిలా అడిగాడు శాస్త్రి మామయ్య.

''... మీ అందరినీ వదిలి శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను'' అంతా వివరంగా చెప్పాడు నాన్న.

అంతా విన్న మామయ్య- ''ఎంత అమాయకుడి



హోయ్, రామ్మూర్తీ! జోస్యాన్ని ఉన్నది ఉన్నట్టు ఎవడూ చెప్ప లేడు. పైగా జోస్యం అంతా జరుగదు. జరిగే పాలు చాలా తక్కువ. వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికి సాధ్యం? మనం మనుషులం రామ్మూర్తీ! ఏ క్షణం ఏం జరుగుతుందో ఈ క్షణం ఏం జరుగుతుందో ఎవరు మాత్రం చెప్పగలరు? అనవసరంగా నువు భయపడి, ఎదుటి వారిని భయపెట్టకు. లక్షణంగా నా కొడుకు పెళ్ళి చూస్తావు'' ధైర్యం చెప్పాడు.

''శాస్త్రీ! జోస్యాన్ని అపహాస్యం చెయ్యకు. జోస్యం అంతా జరిగి తీరుతుంది. నీకొక విషయం చెబుతాను విను. నాకు తెల్సిన మిత్రుడొకడు ఉన్నాడు. ఆయనకు జోస్యం మీద అసలు నమ్మకం లేదు. ఒక రోజు ఆయన దగ్గరకు ఒక కోయవాడు వచ్చాట్ట. ఆయన వద్దన్నా వినకుండా జోస్యం చెబుతానన్నాట్ట. ఆయన పెద్ద కుమారుడికి జోస్యం మీద నమ్మకం వుంది. అతని చెయ్యి చూసి నెల రోజులలో చనిపోతాడని చెప్పాడట. ఆ మాట విన్న నా మిత్రుడు వాడ్ని తన్ని తగిలేశాట్ట. నెలరోజులకి నిజంగానే వాళ్ళ పెద్దబ్బాయి గుండాగి మరణించాడు. అంతదాకా ఎందుకు? నా పెద్ద కూతురు జ్యోతి విషయంలో ఏం జరిగింది? సుబ్బావధాని దాని చెయ్యి చూసి రెండో సంబంధం వాడిని చేసుకుంటుందని చెప్పలేదూ! ఇంకెక్కడోయ్ శాస్త్రీ! జోస్యంలో జరక్కుండా వున్నది? మీరు నమ్మరు శాస్త్రీ! జోస్యం అంతా జరిగి తీరుతుంది. సిద్ధాంతి చెప్పిన రోజుకి నే చావకపోతే నిజంగానే నేనమ్ముతాను, జోస్యం అంతా జరగదని!'' ఆవేశంగా అన్నాడు నాన్న.

'సరేలే, యికనే వెడతాను'' అని వెళ్ళి పోయాడు మామయ్య.

పదినిముషాల సేపు నాన్న ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ వుండి పోయాడు.

''భోజనానికి రండి'' పిలిచింది అమ్మ.

పడక కుర్చీలోంచి లేచి వెళ్ళి విస్తరి ముందు కూర్చున్నాడు నాన్న.

''నువు కూడా రావే,'' నన్ను కూడా పిలిచింది అమ్మ. ఎందుకో తనకి అన్నం తినాలనిపించలేదు.

''తర్వాత వస్తానులే- నీతో వస్తాను'' చెప్పింది తను.

భోజనం చేస్తున్నంతసేపూ నాన్న అమ్మతో ఏం

చిటుకులు:

## గాండ్రించే నక్క

మహిళల విముక్తికై ఎలం కృషి' -అంటూ
మహోపన్యాసాలు చేస్తుంటాడు
చలం పుస్తకాలు పెళ్లాం చూడకుండా
ఎక్కడెక్కడో దాచేస్తుంటాడు

—భండారు పర్వతాలరావు

మాట్లాడినట్లు కనపడలేదు. దానిని బట్టి నాన్న ఏదో విషయం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడనిపించింది.

భోజనం చేసి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు నాన్న. భోజనం చేసిన తర్వాత రెండు గంటలు నడుంవాల్చటం నాన్నకి అలవాటు. కాని, నిన్నట్నుంచి నాన్న సరిగా నిద్రే పోవటంలేదు. ఆలోచనలు నాన్నని నిద్ర పోనివ్వటం లేదేమో!

''కాముడూ!'' పిలిచాడు నాన్న.

''ఏవిటండీ!'' వంటింట్లోంచి వచ్చింది అమ్మ.

''జ్యోతి దగ్గరకు వెడదామను కుంటున్నాను'' అన్నాడు నాన్న.

నాన్న ఉద్దేశాన్ని గ్రహించినట్లుంది అమ్మ- మౌనంగా నిల్చుంది.

''మాట్లాడవేం?''

''మీరు వెళ్ళటం దేనికి? ఉత్తరం ముక్క రాస్తే అదే వస్తుందిగా!''

''పిల్లల్ని తీసుకుని అది యిక్కడకు రావడం కంటే... నేనే అక్కడికి వెళ్ళటం బాగుంటుందికదూ! పైగా అల్లుడికి సెలవు దొరుకుతుందో, లేదో, అల్లుడిని చూసికూడా చాలా రోజులైంది''

అమ్మ మాట్లాడ లేదు.

ఆ సాయంత్రమే నాన్న అక్కయ్యగారి వూరు వెళ్ళారు.

నాన్న వెళ్ళిన తర్వాత అమ్మ మనసు విప్పి తనతో చెప్పుకుంది. అమ్మ మాటలు వింటూంటే తనకు భయం వేసింది.

''నాకూ జోస్యం మీద నమ్మకం వుంది, లక్ష్మీ! నాన్న చెప్పింది నిజం. అక్కయ్యకు రెండో సంబంధాని కిస్తామని ముందే తెలుసు. అట్లాగే జరిగింది కదా! ఇరవై ఏళ్ళ క్రితం ఓరోజు మీ నాన్న చెప్పారు......ఎవరో బైరాగి తన చెయ్యి చూసి చెప్పాట్ట. అరవయ్యో ఏడు దాటుతూండగా తను చచ్చిపోతారని. మీకు చాదస్తం జాస్తి అని ఆయన మాటలు కొట్టి పారేశాను. మళ్ళీ నిన్న సిద్ధాంతి కూడా యిదే మాట...'' ఈ మాటలంటున్నప్పుడు అమ్మ గొంతు జీరవోయింద

''నా కెందుకో భయంగా వుంది. ఆయన తర్వాత నేను బ్రతుకలేను. ఆయన వుండగానే పునిస్త్రీగా... పుట్టెడు పసుపు కుంకుమలతో పోతే ఎంత అదృష్టం! ఎంతమందికో ఆ భాగ్యం!'' యింక అమ్మ మాటలు వినలేకపోయింది తను.

''అమ్మా...యింకెపుడూ యిలా మాట్లాడకు ...నువ్వూ నాన్న మాటలు నమ్ముతున్నావా?... నీ మాటలు వింటూంటే నా హృదయం కోస్తున్నట్లుంది'' విలపించింది తను అమ్మ ఒడిలో వాలిపోతూ.

''ఇంకెపుడూ నీ ముందిలా మాట్లాడనులే, తల్లీ!'' తనను గుండలకు హత్తుకుంటూ అంది.

రెండు రోజుల తర్వాత నాన్న తిరిగి వచ్చాడు.

నాన్న యింట్లో లేని రెండ్రోజులూ ఎంతో ప్రశాంతంగా వుంది. ఇంట్లో ప్రశాంతంగానే వుంది కాని, అమ్మ గుండెలో మాత్రం గూడుకట్టుకున్న అశాంతి అలాగే నిలిచిపోయింది. అది రెండు రోజుల్లో నిలిచిపోయే అశాంతి కాదు.


''కాముడూ! జ్యోతి నా మాటలు నమ్మలేదు. పైగా హాస్యమాడింది. దానికి యిదివరలో జోస్యమంటే నమ్మక మున్నట్లు జ్ఞాపకం. అది స్కూల్లో చదువుకునే రోజుల్లో పరీక్ష పాసవుతుందో, లేదో తెలుసుకోటానికి చిలకజోస్యం చెప్పించుకునేది కదూ! ఇపుడు దానికి జోస్యంమీద కూడా అంత నమ్మకం వున్నట్టు లేదు. 'ఇంకా నీకు ఈ పిచ్చి వదల్లేదా, నాన్నా! అనడిగింది. అల్లుడుగారు కూడా యింతే. 'ఏమిటి మామగారూ, ఈ చాదస్తం!' అన్నాడు. ఆఖర్కి పిల్లలు కూడా నాతో పరాచికాలాడారు. 'నువు చచ్చిపోతున్నావా, తాతయ్యా!' అనడిగారు. ఇక అక్కడ నిలవలేకపోయాను...'' నాన్న చెబుతున్నాడు బాధగా.

అమ్మ మాట్లాడకుండా వింటూంది. నాన్న మాటలు వింటూంటే తనకి కూడా చాలా బాధ అనిపించింది. సిద్ధాంతి చెప్పిన రోజు రానే వచ్చింది.

అందరి గుండెల్లోనూ నెలకొన్న అశాంతి రెండింత లయింది. యిక నాన్న సంగతి సరేసరి. రోజూకన్నా ముందుగానే నిద్రలేచాడు. నిద్రలేవడానికి అసలు నాన్న నిద్రపోతేగదా! ఈ పదిహేనురోజుల్నుంచీ అంతే-

స్నానం చేసి, దేవుడికి నమస్కారం పెట్టుకుని, వూళ్ళో వున్న దేవాలయాలన్నిటికీ వెళ్ళివచ్చాడు.

మిత్రులందరిళ్ళకూ వెళ్ళి పరామర్శించి యిదే చివరి చూపనీ, తనకి రుణం తీరిపోయిందనీ, ఈ భూమ్మీద నూకలు చెల్లాయనీ... ఎన్నో విషయాలు చెప్పాడు వాళ్ళతో. కొంతమంది నాన్న మాటలు



నమ్మారు. కొంతమంది ఆయన వాదస్థానికి నవ్వుకున్నారు. నాన్నకి యివన్నీ అనవసరం. ఎదుటివారు తన మాట నమ్మారా, లేదాని కాదు. ఆయన ఆత్రం ఆయనది. ఆ రోజు ఆయన చనిపోతున్నాడు- అంతే.

ఎట్లాగో అమ్మ వంట పూర్తిచేసి నాన్నను భోజనానికి పిలిచింది.

“కాముడూ! ఎపుడో పెళ్ళయిన కొత్తలో కలిసి భోంచేసేవాళ్ళం. చాలా ఏళ్ళయింది కదూ అలా భోంచేసి. మళ్ళీ ఈ రోజు నీతో కలిసి భోంచెయ్యాలనిపిస్తూంది, నువు కూడా వడ్డించుకో!” అన్నాడు నాన్న.

విస్తరి మీద నీళ్ళు జల్లుతూంది అమ్మ. నాన్న మాటలు వింటూంటే ఆమెకు దుఃఖం ఆగలేదు. కన్నీటి బొట్లు టపటపా విస్తరిలో పడ్డాయి. ఆ విస్తరి తీసేసి మరో విస్తరి వేసింది.

తనకి కూడా వడ్డించుకుని, తనకు కూడా కంచం పెట్టింది అమ్మ.

“నువు కూడా రా, లక్ష్మీ” పిలిచాడు నాన్న.

తను వెళ్ళి పీట మీద కూర్చుంది.

ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు.

“అమ్మా, లక్ష్మీ! నేను పోయినతర్వాత మీ అమ్మను ఎట్లా చూసుకుంటావో... ఏమో... మీ అమ్మ బాధ్యతంతా నీదే. కొడుకువైనా, కూతురువైనా నీవే తల్లీ! పదివేలు ఇన్స్యూర్ చేశాను. నువు చదువు మానెయ్యకు. ఇంటరయిన తర్వాత డిగ్రీలో చేరు. తండ్రిలేని బిడ్డలా ఎపుడూ అనుకోకు. అన్నిటికీ మీ అమ్మ వుంది. నీ పెళ్ళి చూసే యోగం నాకు లేదు. ఏం చేస్తాం! ఎంతవరకు ప్రాప్తమో అంతవరకే!”

నాన్న మాటలు వింటూంటే తనకి దుఃఖం ఆగలేదు. అమ్మ సంగతి వేరే చెప్పక్కర్లేదు. పమిట కొంగుతో కళ్ళు వత్తుకుంటూంది. అమ్మకళ్ళు వర్షిస్తున్నాయి. అన్నం సహించలేదు. ఎవరికీ సహించలేదు. అన్నం తినకుండానే చేతులు కడిగేశాంముగ్గురం.

సాయంత్రం అయ్యేవరకు నాన్న ఏవో అప్పగింతలు పెడుతూనే వున్నాడు అమ్మకు. “కాముడూ! మంచి సంబంధం చూసి లక్ష్మికి పెళ్ళి చెయ్యి. అది చదివినంత వరకూ చదివించు. తెలివిగలది. అక్కడక్కడా చిల్లర మల్లర బాకీలు చేశాను. వాటిని తీర్చేయి. ఇంటిని జాగ్రత్తగా చూసుకో... నీ మెళ్లో గొలుసు జ్యోతికి యివ్వక- లక్ష్మికే యివ్వు”. యింకా ఎన్నో... ఎన్నెన్నో- అమ్మ కంటికీ మంటికీ ఏకధార.

చీకటి పడుతూండగా- “గుండెలో పోటుగా వుంది, కాముడూ!” అన్నాడు నాన్న.

వెంటనే డాక్టర్ని పిలుచుకు రమ్మంది అమ్మ తనను.

“ఎందుకు, కాముడూ డాక్టర్ని పిలవటం? మృత్యువును ఏ డాక్టరూ ఆపలేడు. పోయే ప్రాణం ఎటూ పోతుంది. ఇంకా ఈ డాక్టర్లెందుకు? ఈ రాత్రి పన్నెండు గంటల్లోగ నన్ను తీసుకెడుతుంది!”

నాన్న వేదాంత ధోరణి అమ్మ దుఃఖానికి ఆజ్యంలా వుంది.

వెళ్ళి డాక్టర్ని పిలుచుకు వచ్చింది తను.

డాక్టరు నాన్నను పరీక్షించి, “ఏం భయం లేదు. తెల్లవారేసరికి తగ్గిపోతుంది. ఈ మందులు వాడండి!” అని ఏవో టాబ్లెట్లు యిచ్చి, యింజక్షను చేసి వెళ్ళాడు.

## దేశభక్తి

ఇడ్లీ ముక్కలో యిరుక్కొన్న
రాయితోనే పంటి బాధ!
ఇడ్లీ బిల్లు చేతికొస్తే
కట్టలేని పన్ను బాధ!
జుట్టు మీద పన్ను వేస్తే
పట్టి కిందికి లాగినాము
ఉప్పు మీద పన్ను వేస్తే
తరిమి తరిమి కొట్టినాము
ఇడ్లీ మీద పన్నువేస్తే
దేశభక్తితో కడుతున్నాము!
నలభైయేండ్ల స్వాతంత్ర్యం
నాకు తెచ్చిన తృప్తి రాయిది!
దేశమంటే మట్టి కాదని
దేశమంటే మనుజులేనని
కవినంటూ రొమ్ము విరిచి - నే
కమ్మగ కవితాగానం చేస్తే
ఈ కవిత మీదనే పన్ను వేస్తే
చేతులే పైకెత్తేస్తా!!

—పులికంటి కృష్ణారెడ్డి

ఆ రాత్రికి అమ్మ వంట చెయ్యలేదు. రాత్రి గడిచేకొద్దీ నాన్న గుండెపోటు మరీ ఎక్కువైంది. అమ్మ మనసు మనసులో లేదు. నాన్న వేపు పిచ్చిగా చూస్తూ ఆయన గుండెలమీద రాస్తూ కూచుంది.

“కాముడూ!” నీరసంగా పిలిచాడు నాన్న.

ఏమిటన్నట్లు చూసింది అమ్మ నాన్నవేపు.

“అల్లుడికి టెలిగ్రాం యిప్పించు- జ్యోతిని, పిల్లలను తీసుకు రమ్మను”.

నూతిలోంచి వస్తున్నట్లుగా వుంది నాన్న గొంతు.

అమ్మ తనవేపు చూసింది. అర్థం చేసుకున్న తను బయటకు నడిచింది.

టెలిగ్రాఫ్ ఆఫీసు తమ యింటికి దగ్గరే- టెలిగ్రాం యిచ్చి వచ్చింది. టెలిగ్రామెంత త్వరగా అందినా వాళ్ళు వచ్చేసరికి తెల్లవారుతుంది.

తను వచ్చేసరికి నాన్న కళ్ళు మూసుకుని పడుకుని వున్నాడు. అమ్మ ఆయన వేపు అలాగే నిలువు చూపు చూస్తుంది, గుండెల మీద రాస్తూ.

తెల్లవారితే తనకు పరీక్షలు మొదలవుతాయి కాలేజిలో. నాన్నే చావుబతుకుల మధ్య వూగిసలాడుతూంటె తనకు ఈ పరీక్షలెందుకు? చదువులెందుకు?

నాన్న పరిస్థితి చూస్తుంటే నాకు అపనమ్మకంగానే వుంది- ఆయన బ్రతుకు మీద.

అమ్మతో ఏదో మాట్లాడాలని నాన్న ప్రయత్నం కానీ, గుండెపోటు మరీ ఎక్కువగా వుందేమో- మాట్లాడలేక పోతున్నాడు.

టైము చూసింది పదకొండు గంటలు.

నాన్న నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటున్నాడు. కళ్ళు మూతలు పడుతున్నాయి. అమ్మకు కూడా కళ్ళు మూతలు పడుతున్నట్లున్నాయి. తనకూ అలాగే వుంది. ఈ పదిహేను రోజుల్నుంచీ అమ్మకూ నిద్ర లేదు. అహర్నిశలూ నాన్న గురించే ఆలోచనంతా! నిద్ర లేమితో కళ్ళు ఎర్రబడి, ముఖం ఉబ్బింది, పది లంకణాలు చేసిన రోగిలా వుందమ్మ. అమ్మని చూస్తూంటే జాలీ, ఏడుపూ, భయం ఒక్కసారిగా కలిసి తనమీద పడ్డాయి.

అప్రయత్నంగా కళ్ళు గడియారం మీద పడ్డాయి. టైము పదకొండు దాటి, పది నిముషాలయింది. నాన్న నమ్మే జోస్యం ప్రకారం యింకా ఈ లోకం వదలటానికి యాభై నిముషాలుంది. ఆ తలంపు రాగానే నా గుండె వేగం పెరిగింది. అలా జరక్కూడదని మనసు లోనే వేయి దేవుళ్ళకు మొక్కుకున్నాను. కళ్ళు మూతలు పడుతున్నాయి. గత పదిహేను రోజుల్నుంచీ తనకూ నిద్రలేదుగా మరి- మగత నిద్ర పట్టేసింది...

ఒక్కసారి ఉలిక్కి పడి లేచింది. ఎదురుగా గడియారం పన్నెండు గంటలు చూపుతోంది. చివాలున మంచం మీనుంచి లేచి నాన్న వేపు చూసింది.

“కాముడూ...కామూ” పెద్దగా పిలుస్తున్నాడు నాన్న

ఆశ్చర్యమేసింది. అమ్మ పలకలేదు. నాన్న గుండెల మీద తల ఆన్చి పడుకుని వుంది.

“కాముడూ...కాముడూ...” మళ్ళీ పిలిచాడు నాన్న.

“........”

“లక్ష్మీ” తనను పిల్చాడు నాన్న. తను లేచి నాన్న దగ్గర కెళ్ళింది.

“మీ అమ్మను పిలు”.

“అమ్మా...అమ్మా...”

“.........”

“నాన్నా... అమ్మ పలకటం లేదు” తను భయంగా చెప్పింది.

నాన్న మెల్లిగా లేచి కూర్చుని అమ్మ తలను తన ఒడిలో ఉంచుకుని నాడి, శ్వాస ఆడుతున్నాయో లేదో చూస్తున్నాడు.

తను వూపిరి పీల్చటం ఆపేసింది.

గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి.

ఒక నిముషం పరీక్షించి నాన్న, “కాముడు మనల్ని అన్యాయం చేసి వెళ్ళి పోయింది, లక్ష్మీ” అంటూ పెద్దగా ఏడుస్తున్నాడు నాన్న.

తన గుండె కొట్టుకోవటం ఆగి పోయిందనిపించింది. కాళ్ళ కింద భూమి పగిలిపోతున్నట్లు తనేదో అగాథంలోకి జారుకుపోతున్నట్లు... అంతా చీకటిగా కళ్ళు బైర్లు కమ్ముతున్నట్లుగా వుంది. తను శిల ప్రతిమలా నిలుచుండిపోయింది.

ఎప్పటికో తన నోరు పెగిలింది. అంతే... “అమ్మా” అంటూ మొదలు నరికిన చెట్టులా నాన్న జోస్యానికి బలై పోయిన అమ్మ మీదకు ఒరిగిపోయింది తను. *